సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 29 । మే । 2024



శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

మదనపల్లె ప్రశాంతతను కాపాడేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

-8లో



రోడ్డు ప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి మృతి

రోడ్డుప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.400
రెండోరకం	రూ.230	రూ.310



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 748 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)


రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	493	493
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 57.00 కిలోలు

న్యూస్‌రీల్

30న ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న జిల్లా జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందని అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు మురళీధర్ తెలిపారు. క్రీడాకారులు 1.1.2009 నుంచి 31.12.2010వ తేదీ లోపు పుట్టినవారై ఉండాలన్నారు. ఆధార్, పుట్టిన రోజు సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు. వివరాలకు 9502074146, 9703282672ను సంప్రదించాలని తెలిపారు.

1నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు



కృష్ణారావు, జిల్లా ఎస్పీ

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లాలో జూన్ 1వ తేదీ నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి వస్తాయని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన రోజు నుంచి వాహనాలను మైనర్లు నడిపితే అందుకు తల్లిదండ్రులకు కానీ సంరక్షకులకు కానీ రూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానాతో పాటు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తామన్నారు.

క్రీడాభారతి జిల్లా కమిటీ ఎంపిక



క్రీడాభారతి జిల్లా కమిటీ

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం జిల్లా క్రీడా భారతి కమిటీ ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయరెడ్డి తెలిపారు. ప్రతి పౌరుడు ఆటలాడుతూ ఆరోగ్యంగా ఉండాలన్నదే క్రీడాభారతి ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్, కార్యదర్శిగా శ్రీవాణి, గౌరవాధ్యక్షుడిగా జీపీ.రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కరాటే సురేష్, శ్రీధర్‌కుమార్, భారతి, విజయకుమార్, విష్ణు, జాయింట్ సెక్రటరీలుగా శివశంకర్, రాజేశ్వరి, ఉదయ్, మమకర్, రెడ్డి ప్రసాద్, సభ్యులుగా యూసుఫ్, భద్రయ్య, లత, శరత్, ఉదయ్, పార్థసారథిలను ఎన్నుకున్నామని ధనంజయరెడ్డి వెల్లడించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

రాయచోటి: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల తీరును జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి ఆర్. కృష్ణయ్య పరిశీలించారు. మంగళవారం ఆయన జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా మంగళవారం జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు 6758 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. జిల్లాలో మొదటి సంవత్సరానికి చెందిన 5791 మంది విద్యార్థులకుగాను 5578 మంది హాజరుకాగా, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1240 మంది విద్యార్థులకు గాను 1180 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్ లో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్. ఈశ్వర్ రెడ్డి తో కలిసి పరీక్ష ఫలితాల గణాంకాలను పరిశీలించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీఏలో 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా అందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బీబీఏలో 249 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. బీకాంలో 4,012 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,947 మంది (98.38 శాతం) ఉత్తీర్ణత పొందారన్నారు. బీఎస్సీలో 3,721 మంది పరీక్షలు రాయగా 3,681 మంది (98.93 శాతం) ఉత్తీర్ణులు అయ్యారని వివరించారు. డిగ్రీ పరీక్షలు గత నెలలో మొదలై ఈనెల 24వ తేదీ వరకు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ సహాయ అధికారి డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు బంగారు బాట



గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోంది. మనబడి, నాడు–నేడు అంటూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, సకల సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం అదే పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌ను కూడా ప్రవేశపెట్టి ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని నాలుగు ఉన్నత పాఠశాలలను 'హైస్కూల్ ప్లస్'గా అప్‌గ్రేడ్ చేసి పేద విద్యార్థులు ఉన్నత చదువులకు బంగారు బాటలు వేసింది.

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్
- ప్రతి మండలంలో రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు
- జిల్లాలో నాలుగు కో ఎడ్యుకేషన్ 10 ప్లస్ స్కూళ్లు మంజూరు



జూనియర్ కాలేజీగా మారిన మదనపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ: గ్రామీణ ప్రాంతాలకు సమీపంలో జూనియర్ కాలేజీలు లేని కారణంగా అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారు. ఈ దుస్థితిని గమనించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేసి ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత వచ్చిన పాలకులెవరూ ప్రభుత్వ ఇంటర్ కళాశాలల ఏర్పాటుకు శ్రద్ధ తీసుకోలేదు. సీఎం వై.ఎస్.జగన్ అధికారంలోకి వచ్చాక విద్యా రంగంలో విప్లవమే తీసుకొచ్చారు. మహానేత వైఎస్సార్‌ను స్ఫూర్తిగా తీసుకొని గ్రామీణ ప్రాంతాల్లో సైతం కొత్త జూనియర్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల స్థాయిలోనే ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. తొలుత జిల్లాకు ఒక హైస్కూల్‌ను ఎంపిక చేసి హైస్కూల్ ప్లస్ పేరుతో రెండేళ్ల క్రితం ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు. మంచి ఫలితాలు రావడంతో ఈ విధానాన్ని మరింత విస్తరించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం మరో నాలుగు మండలాల్లో నాలుగు ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది.

ఒక్కో స్కూల్‌లో రెండు గ్రూపులు

ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో డిమాండ్ ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ,హెచ్ఈసీ గ్రూపులను జూనియర్ కాలేజీల్లో నిర్వహిస్తారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీసీ, సీఈసీ ఇంగ్లీషు మీడియం కోర్సులకు ప్రవేశం కల్పించనున్నారు. ఇందులో ఈ ఏడాది ఒక్కో హైస్కూల్‌లో ఏదేని రెండు గ్రూపులకే ప్రవేశాలు నిర్వహిస్తారు. ప్రతి గ్రూప్‌లో 40 మందికి ప్రవేశం కల్పిస్తారు. అంటే ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్నారు. హైస్కూల్ ప్లస్ గా ఎంపిక చేసిన 4 ఉన్నత పాఠశాలల్లో ఆ మేరకు వసతులు, సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేందుకు లైబ్రరీ, ల్యాబ్, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు.కనీసం 2 ఎకరాల విస్తీర్ణం ఉన్న విశాలమైన మైదానాలు ఈ స్కూళ్లల్లో ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ స్కూళ్ల ఏర్పాటుతో ఉన్నత విద్య చేరువకానుంది. ప్రభుత్వ నిర్ణయంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో కొత్త హైస్కూల్ ప్లస్ స్కూళ్ల వివరాలు

మండలం	స్కూల్
మదనపల్లె	జెడ్పీ ఉన్నత పాఠశాల
చిట్వేలి	జెడ్పీ ఉన్నత పాఠశాల
గాలివీడు	జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు)
టీ.సుండుపల్లి	జెడ్పీ ఉన్నత పాఠశాల

గ్రామీణ విద్యార్థులకు వరం



గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల డ్రాపౌట్ల నివారణే ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా ప్రతి మండలంలో రెండు కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉద్దేశం. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో 4 పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ ఏర్పాటు చేశాం. అడ్మిషన్లు కూడా తీసుకుంటున్నారు. ఇది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది.

–యు.శివప్రకాష్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

నేటి నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ

- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రాయచోటి(జగదాంబ సెంటర్): జిల్లాలో మే 29వ తేదీ నుంచి వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ మంగళవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో ఇప్పటివరకు పేర్లు నమోదు చేసుకున్న రైతులందరూ వేరుశనగ విత్తనకాయలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందు కోసం అన్ని ఆర్‌బీకేలలో వేరుశనగ కాయలను సరఫరా చేశామని వెల్లడించారు. కె–6 రకం 35323 క్వింటాళ్లు, నారాయణి 18046 క్వింటాళ్లు, టీసీజీఎస్ 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 1114 క్వింటాళ్లు జిల్లాకు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రానికి వచ్చిన వేరుశనగ కాయలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు వేరుశనగ విత్తన కాయల నాణ్యత విషయంలో రాజీపడకూడదని, నాణ్యతగా సరిగా లేని కాయల లోడును వెంటనే వెనక్కి పంపించాలని సూచించారు. విత్తనకాయల నాణ్యతపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. విత్తనకాయల నాణ్యతలో అధికారులు ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.



విత్తనకాయల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

వ్యాక్సినేషన్ కార్యక్రమం పరిశీలన

రాయచోటి అర్బన్ : జిల్లాలో హాజ్‌యాత్రికులకు జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య వైద్యశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. పట్టణంలోని వాల్మీకివీధి అర్బన్ పీహెచ్‌సిలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఐఓ ఉషశ్రీ, డీఎస్ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం హాజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ క్యాంపులను నిర్వహించామన్నారు. కాగా ప్రైవేటుగా హాజ్‌యాత్రకు వెళ్లేవారికి కూడా వ్యాక్సిన్ వేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు యిచ్చిందన్నారు. ఆమేరకు వారికోసం ప్రత్యేకంగా వ్యాక్సిన్ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాన్ని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తామన్నారు. వ్యాక్సినేషన్ అనంతరం వారికి వ్యాక్సినేటెడ్ సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తామని వివరించారు. హాజ్‌యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సునీత, అల్తాఫ్, ఆరోగ్యసిబ్బందిలు పాల్గొన్నారు.



హాజ్‌యాత్రికుల వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, జిల్లా వైద్యాధికారులు

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ(సిపెట్)డిప్లమో కోర్సులకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ శేఖర్ తెలిపారు. 10వ తరగతి విద్యార్హతతో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డిపెంట్), డిప్లోమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ పెరాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు https://cipet24.onlineregistationform.org. cipet/ అనే లింక్ ద్వారా ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిపెట్ అడ్మిషన్ టెస్టు జూన్ 9న నిర్వహించి అందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు 6300147965లో నంబర్లో సంప్రదించాలని సీహెచ్ శేఖర్ తెలిపారు.

ఈటీపీబీఎస్, ఎన్‌కోర్‌లపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఐటీ అప్లికేషన్స్ నోడల్ ఆఫీసర్ హరికృష్ణ

రాయచోటి: ఈటీపీబీఎస్, ఎన్‌కోర్‌లపై ఇచ్చిన శిక్షణతో కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవ్వాలని డీఆర్ఓ సత్యనారాయణ రావు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఈటీపీబీఎస్, ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో డేటా ఎంట్రీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈటీపీబీఎస్ ఓట్లను లెక్కించే విధానం, ఎన్‌కోర్ వెబ్‌సైట్‌ను ఉపయోగించే విధానంపై ఇచ్చిన శిక్షణతో కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవ్వాలని డీఆర్ఓ అన్నారు. అనంతరం ఐటీ అప్లికేషన్స్ నోడల్ ఆఫీసర్ హరికృష్ణ, ఈటీపీబీఎస్‌కు సంబంధించిన వివిధ ఫారాలు, వాటిమీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే విధానంపై వివిధ అంశాలను కౌంటింగ్ సిబ్బందికి వివరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ క్రాంతి కుమార్ ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో డేటా ఎంట్రీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు, డీపీఓ ధనలక్ష్మీ, పీడీ ఏపీఎంఐపీ వెంకటేశ్వర రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ బాస్ ఆర్వోనే!

- ఓట్ల లెక్కింపులో ఈసీ గైడ్‌లైన్స్
- రౌండ్ల వారీగా ఫలితాలు నమోదు
- ఎన్‌కోర్ యాప్‌లో నమోదు తర్వాతే ఫలితాలు వెల్లడి
- కౌంటింగ్ క్లోజ్..ఫైనల్ రిజల్ట్‌తోనే ఫారం 21–ఈ అభ్యర్థికి అందజేత



కౌంటింగ్ కేంద్రం (ఫైల్)

రాజంపేట: జిల్లా కేంద్రమైన రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏ నియోజకవర్గాల కౌంటింగ్‌కు ఆ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారే బాస్.. ఆయన నిర్ణయం తుది నిర్ణయమని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగానే ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటించనున్నారు. ఈ ఫలితాల ప్రకటనలో ఆర్వో తప్ప మిగతా అధికారులెవరూ సొంత నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని ఈసీ స్పష్టం చేసింది.

స్ట్రాంగ్‌రూం ఓపెన్ మొదలు.....

ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూం ఓపెన్ చేయనున్నారు. జూన్ 4వ తేదిన 6గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు ఏజెంట్లు, అధికారులు కలిసి స్ట్రాంగ్‌రూంను ఓపెన్ చేసే కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపులో ఏవైనా సందేహాలు వచ్చినప్పుడు ఆర్వోలతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకోవాలి. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్, సర్వీస్ ఓటర్లు (ఈటీఎస్‌బీఎస్), ఓట్లు ఏ విధంగా లెక్కించాలి అనేదానిపై శిక్షణ ఇస్తున్నారు.

సిబ్బందికి వేర్వేరు యూనిఫాం..

ఈవీఎంలను కేంద్రంలోకి తీసుకొచ్చేందుకు సిబ్బందిని కేటాయిస్తారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందికి వేర్వేరు యూనిఫాం ఇస్తారు. రౌండు పూర్తయ్యాకే మరో రౌండుకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు తీసుకురావాల్సి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే వారికి ఐడీ కార్డులు తప్ప, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు ఉండరాదు.

స్ట్రాంగ్‌రూం ఓపెన్ ఇలా..

ఓట్ల లెక్కింపులో భాగంగా స్ట్రాంగ్‌రూంలను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తారు.

నియోజకవర్గం	ఆర్వో	మొబైల్ నెంబరు
పీలేరు	ఫర్మాన్ అహ్మద్	89779 42102
రాజంపేట	మోహనరావు	89779 42105
రైల్వేకోడూరు	లీలారాణి	93476 99529
రాయచోటి	రంగస్వామి	89779 42104
మదనపల్లె	హరిప్రసాద్	94910 77004
తంబళ్లపల్లె	రాఘవేంద్ర	86396 05448

ఈవీఎంలను నమోదు చేసుకునేందుకు స్ట్రాంగ్‌రూంలో ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకురాగానే వాటికి సీల్ సరిగా ఉందా లేదా అని పరిశీలిస్తారు. ఈవీఎంలో బ్యాటరీలు పనిచేయకపోతే మార్చి ఆన్‌చేస్తారు.

ఎన్‌కోర్‌లో నమోదు తర్వాతే..

ఓట్ల లెక్కింపు పూర్తికాగానే ఎన్‌కోర్‌లో నమోదు తర్వాతే ఫలితాలను ఆయా నియోజకవర్గాల రిట్నరింగ్ అధికారులు వెల్లడించనున్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఒక ఏఆర్వో, కంప్యూటర్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కేంద్రపరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాలు వెల్లడి, డిక్లరేషన్ వరకు దగ్గరుండి పరిశీలిస్తారు. కౌంటింగ్ పూర్తికాగానే ఫలితాలు ప్రకటించి గెలుపొందిన అభ్యర్థికి ఫారం–21 అందజేస్తారు.

పోస్టల్‌బ్యాలెట్ ఓట్లపై...

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై ఈసీ ఇప్పటికే మార్గనిర్దేశకాలు జారీ చేసింది. బ్యాలెట్ పేపరు వెనుక ఆర్వో సంతకం ఉన్నా లేకున్నా సీల్ లేదని పోస్టల్ బ్యాలెట్ ఇన్‌వ్యాలీడ్ చేయరాదు. ఆర్వో సంతకానికి పోస్టుబ్యాలెట్ చెల్లుబాటుకు సంబంధం లేదని ఈసీ స్పష్టంచేసింది.

కౌంటింగ్ కేంద్రం : రాయచోటి

సెంటర్: సాయి ఇంజనీరింగ్ కళాశాల

సెగ్మెంట్లు: ఆరు



3వ తేదీకి కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి కావాలి

జూన్ 3నాటికి కౌటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలి. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయగా, అక్కడే కేంద్రపరిశీలకులతోపాటు కౌంటింగ్ సిబ్బంది ఉంటారు. రాజకీయపార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేక కుర్చీలు ఏర్పాటుచేస్తారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్దే ఉండాలి. పక్క టేబుల్‌వద్దకు వెళ్లరాదు. 14 టేబుల్స్‌కు 14 మంది ఏజెంట్లు ఉంటారు. ఒకసారి కౌంటింగ్ కేంద్రం నుంచి బయటికి వెళితే తిరిగి లోపలికి రావడానికి వీలులేదు.

పాఠ్యపుస్తకాలు సిద్ధం



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో శివప్రకాష్‌రెడ్డి, ఇతర విద్యాశాకాధికారులు

రాయచోటి టౌన్: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి తెలిపారు. జూన్ రెండవ వారంలో పాఠశాలలు పునఃప్రారంభిచే నాటికి ఆయా పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అందించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 6,69, 640 పాఠ్య పుస్తకాలు కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపామని తెలిపారు. ఇప్పటికే 2,43,766 పుస్తకాలు పుస్తకాలు వచ్చాయని తెలిపారు. పాఠశాలలు తెరిచేనాటికి మిగిలిన పాఠ్యపుస్తకాలు కూడా వచ్చేస్తాయని చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వచ్చి పుస్తకాలు తీసుకెళ్లాలని తెలిపారు.

క్లుప్తంగా

రెండు ఆవులు మృతి



మృత్యువాతపడ్డ ఆవులు

చిన్నమండెం : విషాహారం తినడంతో రెండు ఆవులు మృతి చెందినట్లు బాధిత రైతు ఖలీల్ బాషా తెలిపారు. మండల పరిధిలోని చాకిబండ కస్పాకు చెందిన ఖలీల్‌బాషా ఆవులే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విషపు ఆహారం తినడంతో మృత్యువాతపడినట్లు ఆవులను పరీక్షించిన పశువైద్యుడు గణేష్ తెలిపారు. దాదాపు రూ.3 లక్షల విలువ కలిగిన రెండు ఆవులు మృత్యువాతపడటంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మంగళవారం స్థానికుల సమాచారంతో మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కొత్త ఇండ్లు సమీపంలో జూదం ఆడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన అమరనాథరెడ్డి

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డి గారిపల్లె సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమరనాథరెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రాయచోటి పట్టణానికి చెందిన అమరనాథరెడ్డి తన ద్విచక్రవాహనంలో నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా కలకడ వైపు నుంచి రాయచోటికి వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో అమరనాథరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- భూదందాలకు పాల్పడుతున్న 22 మంది బైండోవర్
- పట్టణ ప్రశాంతతను కాపాడే దిశగా పోలీసుల చర్యలు



భూదందాలకు పాల్పడుతున్న 22 మందిని బైండోవర్ చేసిన పోలీసులు

మదనపల్లె : మదనపల్లె ప్రశాంతతను కాపాడేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. పోలీసులకు అందిన కచ్చితమైన సమాచారం మేరకు.. పట్టణంలో గ్యాంగులుగా ఏర్పడి భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతూ, ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న 22 మందిని బైండోవర్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దందాలకు, నేరాలకు పాల్పడకుండా 22 మందిని సెక్షన్ 107 కింద కేసు నమోదు చేసి, సెక్యూరిటీ కింద రూ.లక్ష పూచీకత్తుతో మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ రమాదేవి ఎదుట హాజరుపరిచారు. అనంతరం తమదైన శైలిలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐలు ఎస్.శేఖర్, యువరాజు, వలీబాషు మాట్లాడుతూ.... ల్యాండ్ మాఫియా పేరుతో ఫేక్ పట్టాలు తయారు చేసుకుని, వాస్తవ భూ యజమానులను ఇబ్బంది పెడుతూ, సమస్యను పరిష్కరించే క్రమంలో తామే మధ్యవర్తిగా వ్యవహరిస్తూ.. లక్షల రూపాయల దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు.

బైండోవర్ చేసిన వారిలో మనోహర్, వినోద్, నరేష్, నవీన్‌నాయక్, దేవా, గంగాధర్, నాగరాజు, సుధీర్‌కుమార్, వెంకటరమణ, లవకృష్ణ, బత్తుల రెడ్డిశేఖర్, ఎస్.నరేష్, చంద్రశేఖర్, రూపక్‌నాయక్, వెంకటేష్, జమిత్, అహ్మద్‌అలీ, రెడ్డిశేఖర్, చల్లా రుద్రయ్య, కె.హరిబాబు, గురుమూర్తి, రాఘవేంద్ర, కె.రాజేష్‌లు ఉన్నారన్నారు. వీరే కాకుండా ఇంకా ఎవరైనా పట్టణంలో భూదందాలు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులు ఉంటే తమ దృష్టికి తెస్తే వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. భూతగాదాలు, భూదందాల్లో బాధితులు ఎవరైనా ఉంటే ఎలాంటి భయం లేకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే... పోలీసులు, రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి సమస్య పరిష్కరిస్తామని ఎవరైనా డబ్బులు ఇవ్వాలని కోరితే ఇవ్వవద్దన్నారు. సమస్య ఉంటే నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు, కులసంఘాల పేర్లు చెప్పి, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని కొంతమంది వ్యక్తులు అమాయకులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటికి సంబంధించి ఫిర్యాదులు లేకపోవడంతో తామేమీ చేయలేకపోతున్నామని, బాధితులు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే అసాంఘిక శక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు

ఎస్పీ కృష్ణారావు



లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

లక్కిరెడ్డిపల్లి : ఎన్నికల కౌంటింగ్ ముగిసేంత వరకు గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ప్రతిరోజూ గ్రామాలలో పర్యటించి అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. అలాగే గ్రామాలలో చాలా మంది వ్యక్తులు మద్యం సేవించి పార్టీలకు అతీతంగా గొడవలు పడుతూ ఉంటారని, అలాంటి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయాలన్నారు. కౌంటింగ్ ముగిసేంతవరకు ప్రతిరోజూ గ్రామాలలో కవాతు నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి శాంతి భద్రతలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి మృతి

నెలరోజుల్లో పదవీ విరమణ ఉండగా మృత్యువాత



మృతిచెందిన తమిళసెల్వం

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో సిరికల్చర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం లంకకాలనీకి చెందిన తమిళసెల్వం(60) సిరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యుటేషన్‌పై ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మదనపల్లె మండలంలోని 150వ మైలువద్ద ఉన్న సిరికల్చర్ శిక్షణా కేంద్రంలో ఏడీ రమణారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి సాయంత్రం సిరికల్చర్‌శాఖకు చెందిన ప్రభుత్వ వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో డోర్ అకస్మాత్తుగా తెరచుకోవడంతో ప్రమాదవశాత్తు జారి రోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ప్రమాదంలో మృతి చెందిన తమిళ సెల్వం నెలరోజుల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఈలోపు ప్రమాదంలో మృతి చెందడంపై తోటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమిళసెల్వంకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు వివాదంతో కొత్తపల్లెలో ఉద్రిక్తత



గోడ వద్ద కొత్తపల్లె గ్రామస్తులు

- రాకపోకలకు అడ్డంగా గోడ నిర్మాణం
- ఆగిపోయిన ఏనుగుమల్లమ్మ ఊరేగింపు



ఆగిపోయిన ఏనుగుమల్లమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపు

బి.కొత్తకోట : రహదారిపై గోడను నిర్మించి రాకపోకలకు అడ్డు కల్పిస్తున్నారని గ్రామస్తులు గోడను తొలగించడంతో మంగళవారం రాత్రి బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ కొత్తపల్లెలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామస్తులు మూకుమ్మడిగా గోడను తొలగించడంతో వివాదం రాజుకుంది. దీనిపై రాత్రి 10.30 గంటలకు హెడ్‌కానిస్టేబుల్ రవినాయక్, పోలీసులు గ్రామం చేరుకుని విచారిస్తున్నారు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గట్టులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొత్తపల్లెకు వెళ్లేందుకు మట్టి రహదారి ఉంది. ఈ రహదారి స్థలం తమదంటూ నిర్మల అనే మహిళ మంగళవారం రహదారిపై సిమెంటు పలకలతో గోడను నిర్మించడంతో గ్రామస్తుల రాకపోకలకు అడ్డుగా మారింది. దీనిపై కొత్తపల్లె గ్రామస్తులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్మల నిర్మించిన గోడను తొలగించి ధ్వంసం చేశారు. ఈ ఘటన ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమస్థలంలో గోడను నిర్మించుకున్నామని నిర్మల ఆగ్రహం వ్యక్తం చేసింది. రాకపోకలకు అడ్డంకి అవుతుందని గ్రామస్తులు వాదించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కొత్తపల్లెకు చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. ఈ వివాదం గతంలోనూ జరగడంతో ఇరువర్గాలను సర్ది చెప్పేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కాగా మంగళవారం రాత్రి ట్రాక్టర్‌పై ఏనుగుమల్లమ్మ ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఏనుగుమల్లమ్మను గట్టు, కొత్తపల్లెల్లో భక్తులతో కలిసి ఊరేగింపు నిర్వహించాల్సి ఉంది. కొత్తపల్లె వద్ద రహదారి సమస్య తలెత్తడంతో ఉత్సవ కార్యక్రమం గోడ వద్ద ఆగిపోయింది. ఊరేగింపు కోసం కొత్తపల్లెలోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వెనుదిరిగి ఆలయానికి తరలించారు.

నేటి నుంచి గండిలో హనుమజ్జయంతి వేడుకలు



గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం సాయంత్రం నుంచి హనుమజ్జయంతి వేడుకలు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. బుధవారం సాయంత్రం అంకురార్పణ ఉంటుందన్నారు. గురువారం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, ఆరాధన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం త్రికాల ఆరాధన, చతుస్థానార్చన, చివరి రోజున త్రికాల ఆరాధన, తీర్థ ప్రసాద వినియోగంతో హనుమజ్జయంతి వేడుకలు ముగుస్తాయని వివరించారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డిని కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే కార్పొరేట్ పాఠశాలలు 40 శాతం అడ్మిషన్లు పూర్తి చేశాయని తెలిపారు. అలాగే గుర్తింపు లేని పాఠశాలల జాబితాను పత్రికలకు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్, అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్‌తేజ, అనంతపురం పీడీఎస్‌యూ నాయకుడు విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

కేదార్‌నాథ్‌లో బద్వేలు వాసి మృతి



వెంకటసుబ్బయ్య (ఫైల్)

బద్వేలు అర్బన్ : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ ఆలయ దర్శనానికి వెళ్లిన బద్వేలు వాసి మంగళవారం ఉదయం అక్కడ గుండెపోటుతో మృతి చెందారు. సన్నిహితులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో నివసించే మర్రి వెంకటసుబ్బయ్య (67) ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ 8 ఏళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. తన మిత్రులతో కలిసి మూడు రోజుల క్రితం కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లారు. మంగళవారం ఉదయం కేదార్‌నాథ్ సమీపంలో వెంకటసుబ్బయ్యకు గుండెపోటు రావడంతో పాటు శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తడంతో అక్కడ మృతి చెందినట్లు ఆయనతో పాటు వెళ్లిన స్నేహితుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



దండుమారెమ్మ ఆలయంలో చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగులో వెలసిన దండుమారెమ్మ అమ్మవారిని వైఎస్సార్ జిల్లా పులివెందుల కోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్ రెడ్డి, కళావతమ్మ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విలేకరులతో వారు మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షంతో వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో కళకళలాడాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ మాజీ ఉద్యోగి మృతి



మృతి చెందిన వెంకటేష్

కురబలకోట : కురబలకోట రైల్వే ఫ్లైఓవర్ (ఆర్‌ఓబీ)వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ మాజీ ఉద్యోగి ఎం. వెంకటేష్ (63) మృతి చెందారు. ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి కథనం మేరకు..కురబలకోట రైల్వే ఫ్లైఓవర్ పక్కన పూరేండ్లవారిపల్లెకు చెందిన మాజీ మిలిటరీ ఉద్యోగి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను మంగళవారం మధ్యాహ్నం ఫ్లైఓవర్ వద్ద టీవీఎస్‌పై రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. రెండు కాళ్లు విరిగిపోయాయి. హుటాహుటిన ఇతన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. మరో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన రాయచోటికి చెందిన వారి కారు స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

101 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

సిద్ధవటం : మండలంలోని ఆకురోపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో తన పాత ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 101 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నామని కడప విజిలెన్స్ సీఐ టి. రెడ్డెప్ప తెలిపారు. కడప రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు ఈ దాడి నిర్వహించామన్నారు. సిద్ధవటం గ్రామానికి చెందిన యర్రగుండు నాగమునిరెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డి ఆకురోపల్లె గ్రామం ఎస్సీ కాలనీలోని తన పాత ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 43 క్వింటాళ్ల 101 బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ రేషన్ బియ్యం విలువ రూ. 1,85,072 చేస్తుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో విజిలెన్స్ అగ్రికల్చర్ అధికారి ఇ. బాలగంగాధర్‌రెడ్డి, డీసీటీఓ ఎస్. ఖాజాహుస్సేన్, సిద్ధవటం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



లక్కిరెడ్డిపల్లి : రామాపురం మండలం, పాలనగారిపల్లి వంక నుంచి నాలుగు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లతోపాటు 16 టన్నుల ఇసుకను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. చెరువులు, నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌కు రూ. 10 వేలు, టిప్పర్‌కు రూ. 25 వేలు జరిమానా ఉంటుందన్నారు. రెండోసారి పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ. 25 వేలు, టిప్పర్‌కు రూ. 50 వేలు జరిమానా, మూడోసారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, నాగరాజు, జ్యోతి, సిబ్బంది జగదీశ్వర, ఆంజనేయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

కొండాపురం : మండల పరిధిలోని దొంకుపల్లె గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు(65) మృతి చెందాడు. కొండాపురం ఎస్ఐ యోగీంద్ర మాట్లాడుతూ మృతుడు యాచకుడై ఉండవచ్చన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

‘వ్యవసాయం’సినిమా నిర్మాణం అభినందనీయం



వ్యవసాయం చిత్రం యూనిట్‌తో రోహాన్ నాగిరెడ్డి

చక్రాయపేట : వ్యవసాయం పేరుతో రైతుల గురించి సినిమా నిర్మించడం అభినందనీయమని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్ కుమార్ రెడ్డి తనయుడు రోహాన్ నాగిరెడ్డి పేర్కొన్నారు. శ్రీ సమరసింహ ప్రజెంట్స్ పతాకంపై వ్యవసాయం అనే సినిమా పూజా కార్యక్రమం మంగళవారం గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని రోహాన్ నాగిరెడ్డి ప్రారంభించినట్లు నిర్మాత గంగాధరరెడ్డి, దర్శకుడు ఇన్ఫినిటీ రఘు తెలిపారు. పులివెందుల, అనంతపురం ప్రాంతాల్లో ఈనెల 30 నుంచి జూన్ 10 వరకు షూటింగ్ నిర్వహించనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయం చిత్ర నటీ నటులు మంజు, చంద్రశేఖరరెడ్డి, దామోదరరెడ్డి, అన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాప్తాడు వంశీ, మానస హరి, డ్రోన్ శివ, తదితరులు పాల్గొన్నారు.

కడప, కర్నూలు జట్ల విజయకేతనం



తలపడుతున్న కడప, అనంతపురం జట్లు



జహీర్ అబ్బాస్, కడప (50 పరుగులు)



హరిశంకర్‌రెడ్డి, కడప (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రీడామైదానాలు వేదికగా మంగళవారం ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కేఓఆర్‌ఎం మైదానంలో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో చిత్తూరు జట్టు 9 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. జట్టులోని కె.ఎస్. పృథ్వీరాజ్ 91 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 88 పరుగులు చేశాడు. ధరణికుమార్ 91 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 83 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సుదర్శన్‌రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 47.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని యూఎంఎస్ గిరినాథ్ 95 ఓవర్లలో 11 ఫోర్లతో 84 పరుగులు చేయగా, క్రముద్దీన్ 35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 53 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ దీపన్‌సాయి 1 వికెట్ తీశాడు. కాగా కర్నూలు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించి 4 పాయింట్లు కైవసం చేసుకుంది.

కేఎస్ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. కడప బౌలర్ హరిశంకర్‌రెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం కడప జట్టు బ్యాటింగ్‌కు దిగగా మైదానంలో ఏర్పాటు చేసి సైడ్‌స్క్రీన్ కింద పడటంతో మ్యాచ్ ఆలస్యమైంది. దీంతో 191 పరుగుల విజయ లక్ష్యాన్ని కడప జట్టుకు నిర్దేశించారు. దీంతో కడప జట్టు 6 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని జహీర్ అబ్బాస్ 50 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.